విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

● ఎంపీపీ స్నేహలత

తొండ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ స్నేహలత

తిరుమలగిరి, జూన్ 13 : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ స్నేహలత అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని తొండ ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. వంట గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శాంతయ్య, ఎంపీఓ మారయ్య, హెచ్ఎం అశోక్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మంజుల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య : కౌన్సిలర్ సాజన్య

హుజూర్‌నగర్ : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని కౌన్సిలర్ చిలకబత్తిని సాజన్య అన్నారు. పట్టణ పరిధిలోని గోవిందపురంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్, పాఠ్య పుస్తకాలను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలి

● అర్వపల్లి ఎంపీపీ రేణాకాలక్ష్మీనర్సయ్యయాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేణాకాలక్ష్మీనర్సయ్యయాదవ్

అర్వపల్లి, జూన్ 13 : మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ మన్నె రేణుకాలక్ష్మీనర్సయ్యయాదవ్, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది తెలుపాలన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. వానకాలం పంటలు సాగు చేసుకునే రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించేందుకు వ్యవసాయ అధికారులు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సందీప్‌కుమార్, వైస్ ఎంపీపీ మారిపెద్ది భవానీశ్రీనివాస్‌గౌడ్, ఎంఈఓ బాలునాయక్, ఏపీఎం మల్లేశ్, సీనియర్ అసిస్టెంట్ నరసింహారావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

● ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు

సిబ్బందికి ఎల్ఈడీ బల్బులను అందిస్తున్న ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు

మేళ్లచెర్వు, జూన్ 13 : గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు తెలిపారు. మండల పరిధిలోని రామాపురం గ్రామంలో పంచాయతీ నిధులతో విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసే ఎల్ఈడీ బల్బులను గురువారం సిబ్బందికి ఆమె అందించి మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బస్సులో పోగొట్టుకున్న పర్సు అందజేత

దంపతులకు పర్సును అందజేస్తున్న సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్, జూన్ 13 : పోగొట్టుకున్న పర్సును రికవరీ చేసి పోలీసులు బాధితులకు అందజేశారు. హుజూర్‌నగర్ పరిధిలోని ఫణిగట్టు వద్ద నివాసం ఉంటున్న ఆవుల శంభయ్య, లక్ష్మి దంపతులు భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. బుధవారం రాత్రి కోదాడ నుంచి హుజూర్‌నగర్ వచ్చేందుకు మిర్యాలగూడెం డిపోకు చెందిన బస్సు ఎక్కారు. రాత్రి బస్సు దిగుతున్న సమయంలో డబ్బులు ఉన్న సంచి మరచిపోయారు. పెట్రోలింగ్‌లో ఉన్న ఏఎస్ఐ పరమేశ్‌కు ఫిర్యాదు చేయడంతో బస్సు నుంచి సంచిని రికవరీ చేశారు. సంచిలో రూ.34 వేలు ఉన్నట్లుగా తెలిపారు. హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య ఆధ్వర్యంలో గురువారం పోలీస్ స్టేషన్‌లో నగదు సంచిని బాధితులకు అందజేశారు.

దర్జీలకు సన్మానం

దర్జీలను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి

నేరేడుచర్ల, జూన్ 13 : జాతీయ కుట్టుమిషన్ దినోత్సవం సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు దర్జీలను గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 30 ఏండ్లుగా ఈ వృత్తిలో జీవనం సాగిస్తున్న మైబెల్లి, శంకర్, జ్యోతిని క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జిలకర రామస్వామి, సభ్యులు ఎస్‌కే యూసఫ్, గుండ్రెడ్డి సైదిరెడ్డి, మూలగుండ్ల వెంకట్‌రెడ్డి, మాతంగి సైదులు, కొణతం ఆదిరెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ NAMASTHE TELANGANA CLASSIFIEDS

సర్టిఫికెట్ పోయినది

★ఆదిమళ్ళ ఝాన్సీ, D/o. ఆదిమళ్ళ శంకరయ్య, R/o. హైదలాపురం, మం. కనగల్, జిల్లా: నల్లగొండ. అను నేను నల్లగొండలోని చైతన్యపురి కాలనీ నుండి ఆటోలో ప్రయాణిస్తుండగా నా యొక్క ఇంటర్ మీడియట్ మెమో (No. 2350202536) పోయినది. దొరికిన వారు సంప్ర: 9346140103.

NLG-00

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/- ప్రతి అదనపు లైన్‌కు 50/-

Note: 3+1 Scheme Available Minimum 4 Lines, Extra Line - Extra Amount

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | హుజూర్‌నగర్ : 9182777630

నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్

బొడ్రాయిబజార్ : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మున్సిపల చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

బొడ్రాయిబజార్, జూన్ 13 : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధుల నుంచి ఎలా రక్షించుకోవాలో అధికారులు, సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. మలేరియా మాసోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పట్టణ ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలో మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది, ఆర్పీలు బాధ్యత ప్రధానమైందన్నారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని 48 వార్డుల్లో ప్రతి కాల్వ, ఇల్లు, పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. శానిటేషన్ సిబ్బంది, ఆర్పీలు ప్రతి శుక్రవారం ప్రజల ఇండ్లు, పరిసరాలను పరిశీలించి శుభ్రపర్చుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టీఎంసీ శ్వేత, హెల్త్ అసిస్టెంట్ సురేశ్, అసిస్టెంట్ ఎస్ఐ సతీశ్, రాజీవ్‌నగర్, గిరినగర్, అంబేద్కర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు రమ్య, హరీశ్, శషాంక్, ఆర్పీలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం : నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ ప్రకాశ్

నేరేడుచర్ల : ప్రతి ఒక్కరూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి నాగినితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవడంతో దోమలను నివారించవచ్చన్నారు. వైద్యాధికారి నాగిని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, మెప్మా పీడీ రేణుక, మేనేజర్ వీరారెడ్డి, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలగిరి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ స్నేహలత అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నివారణపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీఓ మారయ్య, పీహెచ్‌సీ డాక్టర్ వందన, సీహెచ్ఓ బిచ్చునాయక్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మద్దిరాల : వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ సత్యానారాయణరెడ్డి, తాసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మండలంలోని గోరెంట్ల గ్రామంలో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నివారణ అవగాహన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్వపల్లి : వానకాలం సీజన్‌లో కీటకాలు, నీటి ద్వారా వచ్చే వ్యాధులపై మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ బుక్ కీపర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సందీప్‌కుమార్, డాక్టర్ మణిదీప్, సీహెచ్ఓ చరణ్, ఏపీఎం వలిశెట్టి మల్లేశ్ పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి, జూన్ 13 : నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ఆయా శాఖల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రోడ్డు భవనాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా శాఖల ఎస్సీ, ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్ల సర్వే త్వరగా పూర్తి చేయాలి

● డీపీఓ సురేశ్‌కుమార్

సర్వే కార్యక్రమంలో పాల్గొన్న డీపీఓ సురేశ్‌కుమార్

చింతలపాలెం, జూన్ 13 : మిషన్ భగీరథ పథకానికి సంబంధించి ఇంటింటి నల్లా కనెక్షన్ల సర్వే త్వరగా పూర్తి చేయాలని డీపీఓ సురేశ్‌కుమార్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఇప్పటి వరకు జరిగిన మిషన్ భగీరథ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చింతలపాలెం, పులిచింతల ప్రాజెక్ట్ కాలనీ గ్రామాల్లో సర్వే చేస్తున్న తీరును స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటింటి నల్లా కనెక్షన్లు కలిగిన నివాస గృహాలు, ఇంకా కావాల్సిన వివరాలు, నూతనంగా నిర్మించిన ఇండ్లకు ఇవ్వాల్సిన నల్లా కనెక్షన్ల వివరాలన్నీ నమోదు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ బడుగుల జన్మదిన వేడుకలు

ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ బెజవాడ శ్రవణ్ శిలిష

కోదాడ, , జూన్ 13 : మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ జన్మదిన వేడుకలను బెజవాడ శ్రవణ్ యువసేన ఆధ్వర్యంలో గురువారం కోదాడ పట్టణంలోని శనగల రాధాకృష్ణ అనాథ ఆశ్రమంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు, అనాథ పిల్లలకు కేక్, పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బెజవాడ శిరీషాశ్రవణ్, ఆంజనేయులు, రవి, గోసు లక్షణ్, నాని, కుమార్ పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

● సాయిబాబా ఆలయ చైర్మన్ రవికుమార్

భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బొడ్రాయిబజార్, జూన్ 13 : ట్రస్ట్ నూతన కమిటీ ఆధ్వర్యంలో సాయిబాబా ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆలయ కమిటీ నూతన చైర్మన్ కర్నాటి రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆలయంలో పూజలు నిర్వహించి కమిటీ సభ్యులతో కలిసి భక్తులకు అన్నదాన వితరణ చేసి మాట్లాడారు. ప్రతి వారం జరిగే అన్నదాన కార్యక్రమం దాతల సహకారంతో ఇబ్బందులు లేకుండా నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీకి సహకరిస్తున్న భక్తులకు, దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి మన్నెం సదాశివరెడ్డి, కోశాధికారి పోతుగంటి మల్లికార్జున్, సభ్యులు బెలిదె శ్రీనివాసులు, గజ్జల రవీందర్, పటేల్ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కళాకారుడు సుధాకర్ కుటుంబానికి ఆర్థిక సాయం

నాగారం : సుధాకర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైస్ ఎంపీపీ మణిమాల

నాగారం, జూన్ 13 : తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు, మండల కేంద్రానికి చెందిన చిప్పలపల్లి (డప్పు) సుధాకర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆమె వెంట ఎంపీపీ కూరం మణీవెంకన్న, గుండగాని అంబయ్య, చిప్పలపల్లి సోమయ్య, కన్నెబోయిన బద్రి, ఎలుక సైదులు, దేవరకొండ మురళి ఉన్నారు.

వెంపటి గ్రామ యువకుల మానవత్వం

తుంగతుర్తి : మండలంలోని వెంపటి గ్రామానికి చెందిన కొడారి రామక్క అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామ వాట్సాప్ గ్రూప్ ద్వారా యువకులు విరాళాలు సేకరించారు. రూ.60 వేలు సమకూరాయి. ఈ నగదుతో పాటు విఘ్నేశ్వర అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.16 వేలు, 25 కిలోల బియ్యాన్ని రామక్క కుటుంబానికి అందజేసి గ్రామ యువకులు మరోసారి మానవత్వం చాటుకున్నారు.

రైతులకు విత్తనాలు వెంటనే అందించాలి

● ఏఐకేఎంఎస్ నాయకులు

ఆత్మకూర్.ఎస్, జూన్ 13 : రైతులకు విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐకేఎంఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్టూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య మాట్లాడుతూ.. కాలం నడి నెత్తికి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పంటల ప్రణాళిక ప్రకటించలేదన్నారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్య ధోరణికి ఇది నిదర్శనమన్నారు. ఒకవైపు రుతుపవనాలు తరుముకొస్తుంటే విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారన్నారు. అందాల్సిన రైతు భరోసా, రుణ మాఫీ, బోనస్ బోగస్ వాగ్దానాలేనా అన్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇప్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కనుకుట్ల సైదులు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంకటకృష్ణ, నర్సిరెడ్డి, బొల్లె వెంకన్న, సంజీవరెడ్డి, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క, పీవైఏ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, వీరానాయక్, వీరయ్య, కొరివి అంజయ్య, బత్తుల వీరయ్య పాల్గొన్నారు.

తాసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అభిమానుల పాదయాత్ర

● సూర్యాపేట ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయంతో మొక్కులు

● సూర్యాపేట నుంచి యాదగిరి గుట్టకు బయల్దేరిన యువకులు

సూర్యాపేట టౌన్ : సూర్యాపేట నుంచి యాదగిరిగుట్టకు కాలినడక బయల్దేరిన మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అభిమానులు

సూర్యాపేట టౌన్, జూన్ 13 : సూర్యాపేట ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి గెలిచిన సందర్భంగా ఆయన అభిమానులు మొక్కులు చెల్లించుకునేందుకు సూర్యాపేట నుంచి యాదగిరిగుట్టకు పాదయాత్ర చేపట్టారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురువారం ఉదయం పూజలు నిర్వహించి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో మొక్కులు చెల్లించుకునేందుకు కాలినడకన బయల్దేరారు. తాము ఆకాంక్షించినట్లుగా తమ అభిమాన నాయకుడు మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచాడని, అందులో భాగంగా లక్ష్మీనరసింహ స్వామికి మొక్కు చెల్లించుకుంటున్నామని పాదయాత్ర చేపట్టిన యువకులు తెలిపారు. కార్యక్రమంలో గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అభిమానులు తిప్పని సుధీర్‌రెడ్డి, ఎలక హరీశ్‌రెడ్డి, వై.కౌశిక్ రెడ్డి, సందీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, జాన్‌రెడ్డి, మద్దికుంట్ల చింటు, స్టాలిన్, శ్రీను, పృథ్వీ, వేణు, ప్రశాంత్ పాల్గొన్నారు.

తిమ్మాపురంలో ఘన స్వాగతం

అర్వపల్లి : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అభిమానుల పాదయాత్ర తిమ్మాపురం వద్దకు చేరుకోగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్ వారికి ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి కావాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. పాదయాత్రకు స్వాగతం పలికిన వారిలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కందుల దశరథ రామారావు, మంగదుడ్ల మల్లయ్య, దలువాయి సదనందరావు, జ్యోతుల రాంబాయమ్మ, పాలేలి నాగమ్మ, నిమ్మెల లింగయ్య, దలువై వెంకట్, నారాయణ, అదె మధు, నిమ్మనగోటి కిరణ్ ఉన్నారు.

గిరిజన మినీ గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

చివ్వెంల, జూన్ 13 : మండల కేంద్రంలోని గిరిజన మినీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు అర్హులైన మండలానికి చెందిన గిరిజన బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రీజినల్ కో ఆర్డినేటర్ కె.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో 30, ఐదవ తరగతిలో 9 సీట్లు, 2 నుంచి 5వ తరగతి వరకు మిగిలిన సీట్లకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు 2, కుల, ఆదాయ, దృవీకరణ పత్రాలతో హెచ్ఎంకు ఈ నెల 18 లోపు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అడ్మిషన్ ప్రక్రియ ఈ నెల 21న లాటరీ పద్ధతి ద్వారా అడ్మిషన్ కమిటీ సమక్షంలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

టీఎమ్మార్పీఎస్ నూతన కమిటీ

బొడ్రాయిబజార్, జూన్ 13 : తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జిగా జిల్లా కేంద్రానికి చెందిన పడిదల రవికుమార్‌మాదిగ, రాష్ట్ర కార్యదర్శిగా మరికంటి అంబేద్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

అధ్వానంగా ఉన్న నడిగడ్డ రహదారి

అధ్వానంగా నడిగడ్డ డొంక రహదారి

మఠంపల్లి, జూన్ 13 : మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన రైతులు నడిగడ్డ డొంక వైపు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలని రైతులు, వ్యవసాయ కూలీలు ప్రభుత్వాన్ని కోరారు. రోడ్డు మొత్తం రాళ్లతో ఉన్నదని వెంటనే పనులు చేపట్టి పూర్తి చేయాలని పేర్కొన్నారు.

సహకార బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

● సీఈఓ శంకర్‌రావు

నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ శంకర్‌రావు

తిరుమలగిరి, జూన్ 13 : నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సేవలను ఖాతాదారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆశాఖ సీఈఓ శంకర్‌రావు అన్నారు. గురువారం తిరుమలగిరి సూర్యాపేట రోడ్డులోని నూతన భవనంలోకి మార్చిన సహకార బ్యాంక్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు పాలేపు చంద్రశేఖర్, సురేందర్ రెడ్డి, బ్యాంక్ మేనేజర్ అలీముద్దీన్, సిబ్బంది, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు భూమిని పంచాలి

● తాసీల్దార్‌కు వేపలమాధవరం దళిత కుటుంబీకుల వినతి

తాసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

మేళ్లచెరువు, జూన్ 13 : నిరుపేదలకు భూమిని పంచాలని కోరుతూ మండలంలోని వేపలమాధవరం గ్రామానికి చెందిన పలువురు దళిత కుటుంబీకులు గురువారం తాసీల్దార్ జ్యోతికి వినతి పత్రం అందించారు. గ్రామ శివారులోని సర్వే నంబర్ 141లో కొన్నేండ్లుగా తాము కంప చెట్లు, రాళ్లు, గుట్టలను తొలగించి చదును చేసుకుంటున్నామని ఈ క్రమంలో కొంతమంది అట్టి భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వినతి పత్రంలో తెలిపారు. ఈ విషయంపై సర్వే నిర్వహించి భూమి లేని దళిత కుటుంబాలకు అట్టి భూమిని పంచాలని కోరారు.

కోదాడ కిట్స్‌లో క్యాంపస్ సెలక్షన్స్

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులు

కోదాడ టౌన్, జూన్ 13 : కోదాడ పట్టణంలోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు లక్ష్మీచెన్నకేశవ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీకి డిజిటల్ మార్కెటింగ్ చేయుటకు ఎంపికైనట్లు కళాశాల చైర్మన్ నీలా సత్యనారాయణ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులకు రూ.2.5 లక్షల వార్షిక వేతనాన్ని చెల్లించేందుకు కంపెనీ ప్రొప్రయిటర్ సీహెచ్ హరిబాబు ఒప్పందం కుదుర్చునట్లుగా తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకాడమీ అడ్వైజర్ పోతుగంటి నాగేశ్వర్‌రావు, అకాడమీ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ నాగార్జునరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గాంధీ, ఏఓ కృష్ణారావు పాల్గొన్నారు.